దేవత

టెంపోరావ్

మెర్సిడిస్ కారు వేగంగా ట్రంక్ రోడ్డమ్మట దూసుకు పోతోంది. వెనుక సీటుమీద రాజా, అనసూయ కూర్చుని వున్నారు.

యూనిఫాంలో వున్న డ్రయివర్ వెనక్కి చూడకుండా కారును పోనిస్తున్నాడు.

తన ముందున్న బటన్ నొక్కాడు రాజా. చటుక్కున ఒక తెర ఎడంవైపునుంచి కుడిపక్కకు పాకింది. ఇటు పైన వెనుక కూర్చున్న వాళ్ళు ముందున్న వాళ్ళకు కనిపించరు.

రాజా నవ్వుతూ పక్క కూర్చున్న అనసూయవైపు చూశాడు. అతడి హృదయం ఆనందంతో పొంగింది. వాళ్ళ పెళ్ళయి వారం రోజులు అయింది. అతడు తన భార్యను మద్రాసుకు కారులో తీసుకుపోతున్నాడు.

అనసూయ కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. మనుషుల జీవితాలతో విధి ఆడే ఆటను గురించి ఆమె

ఆలోచిస్తోంది.

వారంరోజుల క్రితం ఆమె ఒక బీదపిల్ల. ఇప్పుడు మెర్సిడిస్ కారులో సుఖంగా ఆమె ప్రయాణం చేస్తోంది. ఖరీదైన పట్టుచీర ధరించింది. ఒంటినిండా నగలు. చేతికి ఆటోమేటిక్ సిటిజన్ వాచ్!

తన జీవితం పూర్తిగా మారిపోయింది. అనసూయ తండ్రి స్కూలు మాస్టరు. రిటైరయి మూడేళ్ళు దాటింది. పద్దెనిమిదేళ్ళు వచ్చినా ఆమెకు పెళ్ళిచేయలేక తండ్రి వూరుకున్నాడు. కొంతమంది విద్యార్థులకు ట్యూషన్లు చెప్పి వచ్చే ఆదాయంతో అతడు సంసారాన్ని సాగిస్తున్నాడు.

ఉమ పెళ్ళిలో తను వూహించని మిరకిల్ సంభవించింది. ఉమ తల్లి ప్రభావతి రాజా అక్క. తన మేనకోడలు పెళ్ళికి రాజా మద్రాసునుంచి కారులో వచ్చాడు.

ఆ పెళ్ళిలో రాజా చూపు అనసూయమీద పడింది. అటుపైన ఆమెమీదే నిల్చిపోయింది.

ఏదేనా కోరిక తనలో లేస్తే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే మనిషి కాడతను. అక్క ప్రభావతితో మాట్లాడాడు.

"అక్కయ్యా, ఆ అమ్మాయి ఎవరు?" అడిగాడతను.

"వీర్రాజు మాస్టారి కూతురు. ఇంకా పెళ్ళి కాలేదు. పేద పిల్ల" అందామె.

"అమ్మాయి ఒప్పుకుంటే నేనామెను పెళ్ళాడతాను" అన్నాడతను.

ఆమె తమ్ముడివైపు ఆశ్చర్యంగా చూసింది. "ఏమిట్రా, నీకోసం ధనవంతుల కూతుళ్ళు ఎగబడ్డారు!"

"ఆ పిల్ల నాకు నచ్చింది. ఆమె తండ్రితో మాట్లాడు"

అన్నాడతను.

"అదెంత పనిరా! నిన్ను కళ్ళకద్దుకుని, నీ కాళ్ళు కడిగి ఆ పిల్లనిస్తారు. కాని ఆలోచించు! ఆ పిల్ల నీకు తగదు!"

"అక్కా ఆలోచించి నిశ్చయించుకున్నాను. వెంటనే మాట్లాడు. యిక్కడే పెళ్ళిచేసుకుని ఆమెను మద్రాసు తీసుకుపోతాను" అన్నాడతను.

వీర్రాజుతో అక్కయ్య మాట్లాడింది.

"అనసూయ అదృష్టవంతురాలు" అన్నాడతను.

మూడు రోజులు తిరిగేలోగా పెళ్ళయిపోయింది. బీద పిల్ల అనసూయ క్షణంలో ధనవంతురాలై పోయింది.

మెర్సిడిస్ కారు వేగంగా వెళ్తోంది. అనసూయను అతడు దగ్గరకు లాక్కుని పెదిమలమీద ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె కళ్ళమ్మట నీళ్ళు జలజల కారాయి.

"అనూ, ఏడుస్తున్నావా?"

ఆమె జవాబివ్వలేదు. అతడామె కన్నీళ్ళను రుమాల్తో తుడిచాడు.

"అనూ, నీకేమైంది?" అడిగాడతను మళ్ళా.

"అమ్మా, నాన్నా ఎలా వుంటారో ఆ పల్లెటూర్లో! వాళ్ళకు దూరంగా పోతూంటే ఏడుపొస్తోంది" అందామె.

"వాళ్ళు హాయిగా వుంటారు. వాళ్ళకు ఏ లోటూ లేకుండా మనం చూద్దాం. ప్రతి నెల వాళ్ళకు నువ్వు డబ్బు పంపు. ఇటుపైన ట్యూషన్లు మానేసి వాళ్ళు సుఖంగా బ్రతకొచ్చు."

ఆమె అతడిని కౌగలించుకుంది. అతడివైపు ఆప్యా

యంగా చూసింది.

"మీలాంటి భర్త దొరకడం నా అదృష్టం."

"నువ్వు నా భార్య అవడం గొప్ప అదృష్టంగా నేను భావిస్తున్నాను" అన్నాడతను.

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది. అతడి వయస్సు ముప్ఫయిఐదు వుంటుంది. తనకంటే 17 ఏళ్లు పెద్దవాడు. అయినా ఆమె సంతోషించింది.

అతడి హృదయంలో ఆమెను పూర్తిగా వశపర్చుకుంది. అతడితో తన జీవితం హాయిగా సాగుతుంది. తన తలిదండ్రులు కూడా సుఖపడ్డారు. ఆమె అతడి ఒళ్ళో వాలిపోయింది. మెర్సిడిస్ కారు వేగంగా సాగిపోతోంది.

2

సంవత్సరం గడిచిపోయింది.

అనసూయ జీవితం హాయిగా సాగిపోతోంది. తన వ్యాపారం మూలంగా రాజా ఆమెతో ఎక్కువ కాలం గడపలేకపోయేవాడు.

ఆమెకొక కొత్త ఫియట్ కారు కొని అతడు ఇచ్చాడు. ఆమెకు డ్రయివింగ్ నేర్పాడు. అతడు లేనప్పుడు, ఏమీ తోచనప్పుడు ఆమె కారులో అటూ యిటూ తిరిగి బీచ్‌కి పోయి వచ్చేది.

మామూలుగా రాత్రి పన్నెండు తర్వాత అతడు యింటికి తిరిగొచ్చేవాడు. అతడు భోజనం చేస్తుంటే ఆమె పక్కనే కూర్చుని కబుర్లు చెప్పేది. ఆమెవైపు చూస్తూ, ఆనందంగా అతడు వినేవాడు.

ఒకనాటి రాత్రి యిద్దరూ పడుకుని వుండగా ఆమె అతడి దగ్గరగా జరిగింది.

"మీరు చేసే వ్యాపారం ఏమిటో నాకింతవరకూ అర్థం కాలేదు" అందామె.

అతడు నవ్వి ఆమెను ముద్దెట్టుకున్నాడు.

"అదంతా ఎందుకులే!" అని వూరుకున్నాడతను.

"నాకు తెలియడం మంచిదిగా, చెప్పండి" అందామె.

"హోటల్ హెవన్ నాదే. గార్మెంట్స్ ఫాక్టరీ కూడా వుంది. మేం గార్మెంట్సు తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తాం" అన్నాడతను.

"మీతో వచ్చి ఒకసారి మన హోటల్, ఫాక్టరీ చూడాలి" అందామె.

"అనూ, అదంతా నీకు వద్దు! నా వ్యాపారంలో తల దూరిస్తే ఆటుపైన నీకు మనశ్శాంతి వుండదు! ఆ పని నాది. నువ్వు హాయిగా యీ యింట్లో రాణిలా వుండు!"

"ఒంటరిగా ఇక్కడ వుంటే నాకు తోచడంలేదు."

"అనూ, మీ అమ్మనీ, నాన్ననీ వచ్చి యిక్కడ వుండమను. అప్పుడు నీకు తోస్తుంది."

"నిజంగా? వాళ్ళకు ఉత్తరం రాసి రమ్మంటాను."

"రమ్మను" అన్నాడతను.

పదిరోజులు తిరిగేలోపల వీర్రాజు, అతడి భార్య సత్యవతి మద్రాసు చేరుకున్నారు. ఆమె నివశించే పెద్ద మేడ చూసి వీర్రాజు ఆశ్చర్యపోయాడు.

"అమ్మాయి, ఇంద్రభవనంలో వచ్చిపడ్డావు!" అన్నాడు తండ్రి.

"ఇటుపైన మీరు యిక్కడే వుండాలి, నాన్నా" అందామె.

"సంతోషంగా వుంటామమ్మా" అంది తల్లి.

వీర్రాజు కూతురివైపు చూశాడు. అతడి భార్య కన్న

పిల్లలు బాల్యంలోనే మరణించారు. ఆఖరిపిల్ల అనసూయ మాత్రం బతికి, పెరిగి పెద్దదైంది.

"నువ్వుతప్ప మాకెవరున్నారమ్మా! నీతోనే వుంటాం" అన్నాడు తండ్రి.

టెలిఫోన్ మ్రోగింది. ఆమె వెళ్ళి రిసీవర్ని అందుకుంది.

"హలో" అంది.

"అనూ, వాళ్ళొచ్చారా?" అడిగాడు రాజా.

"వచ్చారు. నేనే స్టేషన్కి వెళ్ళి తీసుకువచ్చాను. వాళ్ళను చూశాక నాకు సంతోషంగా వుంది."

"నువ్వు యెప్పుడూ ఆనందంగా వుండాలి. నేను కోరేది అదే. నువ్వంటే నాకెంతో ప్రేమ."

"మీకెంత ప్రేమో తెలుసులెండి. పొద్దుట పోయి రాత్రి పన్నెండింటికి వస్తారు. మీరు ప్రేమించిన వ్యక్తితో మీరు గడిపే కాలం మూడుగంటలు కూడా వుండదు!" అందామె ఆక్షేపణగా.

"రోజంతా యింట్లోనే వుంటే వ్యాపారం దెబ్బతింటుంది. మనకు డబ్బు కావాలిగా! డబ్బుకోసం చాలా పాటుపడాలి!"

"డబ్బు కావాలి, నిజమే! కాని డబ్బుకోసమే మనం జీవించకూడదు!"

"ఇటుపైన అప్పుడప్పుడు మధ్యాహ్నం లంచ్కి వస్తూంటాలే!"

"ఇవాళ వస్తారా?"

"ఇవాళ చాలాపనులున్నాయి. రాలేను. ఈ హోటల్లో భోజనం చాలా బాగుంటుంది. మరో రోజు వస్తాను."

"ఆ టెలిఫోన్ నంబరెంత?"

"ఎందుకు?"

"ఎప్పుడేనా ఫోన్ చేయడానికి" అందామె.

"నేను చేస్తానుగా! నువ్వు ఫోన్ చేయడం దేనికి?"

ఆమె మౌనంగా వుండిపోయింది.

"అనూ, అక్కడ వున్నావా?"

"వుండక మరెక్కడికెళ్తాను?"

"అనూ, అలా అనకు! నీకో కారు కొనిచ్చాను. అందులో తీసుకు వెళ్ళి నీ తలిదండ్రులకు పట్నం చూపించు!"

"ఇవాళే వచ్చారుగా, చూపిస్తాను తర్వాత."

"ఆల్ రైట్ అనూ, వుంటాను. బై బై!"

ఆమె రిసీవర్ని పెట్టేసింది. ఆలోచిస్తూ మేడమెట్లు ఎక్కింది. బాల్కనీలో నుంచుని నలువైపులా చూసింది. గేటు ముందు గూర్ఖా వున్నాడు. ఇద్దరు నౌఖర్లు తోటలో పనిచేస్తున్నారు. వంటామె, మరో ఇద్దరు నౌఖర్లు ఇంట్లో పనిచేస్తున్నారు. ఆ పెద్ద యింట్లో, నౌఖర్ల మధ్య తానొక ఖైదీగా జీవిస్తున్నట్లు అనిపించిందామెకు.

3

తండ్రికి జ్వరంగా వుంది. అనసూయ టెంపరేచర్ చూసింది. 103 డిగ్రీలుంది. ఆమె వెంటనే డాక్టర్ రామ్మూర్తికి ఫోన్ చేసి యింటికి రమ్మంది.

తన తండ్రి జ్వరం గురించి భరత్తో చెప్పడం మంచిదని ఆమె టెలిఫోన్ డైరెక్టరీ పేజీలు తిప్పి హోటల్ హెవన్ నంబరు చూసి డయిల్ చేసింది.

"హలో హోటల్ హెవన్!" అందో స్త్రీ కంఠం అటువైపునుంచి.

"మీ యజమానితో మాట్లాడాలి" అంది అనసూయ.

"మా యజమాని తారాచంద్ గారు ఇంకా రాలేదు!"

అనసూయ క్షణంసేపు ఆలోచించింది. తన భర్త, తారాచంద్ భాగస్వాములా?

"రాజాగారు వున్నారా?"

"మీరెవరు?"

"అనసూయ" అందామె.

"రాజాగారెవరూ యిక్కడ లేరు" అని అటువైపున రిసీవర్ పెట్టేయబడింది.

అనసూయ రిసీవర్ పెట్టేసి కుర్చీలో ఆలోచిస్తూ కూర్చుండిపోయింది.

విచిత్రంగా వుంది. హోటల్ హెవన్ తనదని భర్త చెప్పాడు. అక్కడ తన భర్త ఎందుకులేడు? అతడు పొద్దుటే ఎక్కడికెళ్ళాడు?

భర్త తనతో అబద్ధం చెప్పాడా? ఎందుకలా చెప్పాడు?

టెలిఫోన్ మ్రోగింది. ఆమె రిసీవర్ ఎత్తి "హలో!" అంది.

"అనూ, నేను. ఎందుకు ఫోన్ చేశావు?"

"మీరు హోటల్ హెవన్‌లోనే వున్నారా?"

"వున్నాను. రాజా యిక్కడలేరని నేనే చెప్పమన్నాను."

"తారాచంద్ ఎవరు?" ప్రశ్నించిందామె.

రాజా నవ్వాడు.

"అనూ, తారాచంద్‌ను యజమానిగా వుంచి యీ హోటల్ నేను నడుపుతున్నాను. అన్నీ నా పేరులో వుంటే పన్నులు ఎక్కువగా వుంటాయి. అందుకని అనేక మనుషుల పేర్లతో నేను వ్యాపారం చేస్తూ వుంటాను."

"అలాగా!"

"నాతో ఏదైనా చెప్పాలా?"

"నాన్నకు హై ఫీవర్" అందామె.

"డాక్టర్ రామ్మూర్తి వచ్చాడా?"

"ఫోన్ చేశాను. వస్తానన్నారు."

"డోంట్ బాదర్! కొత్త ఊరుగా, అలా జ్వరాలు మొదట్లో వస్తూంటాయి. ఇంకా ఏమైనా చెప్పాలా?"

"లేదు."

"అనూ, నేను యిక్కడ చాలా బిజీగా వున్నాను. అత్యవసరం అయితేగాని నాకు ఫోన్ చేయకు. నువ్వు ఫోన్ చేస్తే నేను వెంటనే రాకపోవచ్చు. నీ పేరు చెప్పి రిసీవర్ పెట్టేయి. తర్వాత నేను నీకు ఫోను చేస్తాను" అన్నాడతను.

"అలాగే" అని ఆమె రిసీవర్ పెట్టేసింది.

ఆమె మెట్లు దిగి కిందకు వెళ్ళింది. తండ్రి పడుకున్న గదిలోకి అడుగుపెట్టింది.

డాక్టర్ రామ్మూర్తి తండ్రిని పరీక్షిస్తున్నాడు. అతడు అనసూయవంక చూశాడు. ఒక కాగితంమీద కొన్ని మందులురాసి ఆమెకిచ్చాడు.

"రెండు రోజుల్లో తగ్గిపోతుంది. ఈ మందులు వెంటనే యివ్వండి" అన్నాడు డాక్టర్.

ఆమె డాక్టర్‌కు 25 రూపాయలు యిచ్చింది. అతడు బాగ్ తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు. తండ్రిపక్కనే మంచంమీద సత్యవతి కూర్చుని వుంది. నౌఖరును పిల్చి, మందులు కొనమని చెప్పి, అనసూయ వందరూపాయల నోటు యిచ్చింది. నౌఖరు గోపాల్ బయటకు పరు గెత్తాడు.

వీర్రాజు కళ్ళు తెరిచి మూలుగుతూ కూతురివంక చూశాడు.

"మీ అందరికీ శ్రమ కల్గిస్తున్నానమ్మా!" అన్నాడతను.

"శ్రమ ఏముంది నాన్నా! మీకు జ్వరం వచ్చిందని అల్లుడిగారితో చెప్పాను. వీలైనంత తొందరగా వస్తానన్నారు" అంది అనసూయ.

"నా మూలంగా అతని పనులు పాడవకూడదు. ఎందుకమ్మా అతడికి ఫోన్ చేశావు?"

"ఫరవాలేదులే నాన్నా! ఆయనకు పనులు ఎప్పుడూ వుంటూనే వుంటాయి" అందామె.

వీర్రాజు కూతురివంక చూశాడు.

"అతడి వ్యాపారం యింకా వృద్ధి చెందాలమ్మా!" అన్నాడు వీర్రాజు.

4

ఆ రోజు అతడు మధ్యాహ్నం ఒంటిగంటకల్లా ఇంటికొచ్చేశాడు. బ్రీఫ్‌కేసు బీరువాలో పెట్టి పరుపుమీద పడుకున్నాడు.

అనసూయ అతడివైపు నవ్వుతూ చూసింది. ఖరీదైన సూటులో, చక్కటి నెక్ టైతో అతడు పెద్ద ఉద్యోగిలా కనిపిస్తున్నాడు.

"ఒంట్లో బాగాలేదు" అన్నాడతను.

ఆమె పక్కన కూర్చుని అతడి నుదురు, మెడ ముట్టుకు చూసింది. జ్వరం లేదు. కాని అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి.

"మీరు విస్కీ ఎక్కువగా తాగుతున్నారు" అందామె.

అతడు నవ్వాడు. ఆమె అరచెయ్యిని తన బుగ్గకు

రాసుకున్నాను.

"అనూ, నా వ్యాపారం అటువంటిది. నన్ను చూడ్డానికి వచ్చిన వాళ్ళందరకూ విస్కీ యివ్వాలి. వాళ్ళతో నేనూ తాగాలి. వాళ్ళకు ఐస్ వాటర్ ఇస్తే మర్యాదగా వుండదు!" అన్నాడతను.

లేచి వెళ్ళి ఆమె లుంగీ తెచ్చింది. అతని కోటును, టైని తీసేసింది. పాంటు వదిలి అతను లుంగీ కట్టుకున్నాడు. పర్సుతీసి ఆమెకిచ్చాడు.

అన్నిటినీ బీరువాలో పెట్టి ఆమె వెళ్ళి అతడిపక్కనే కూర్చుంది. బనీను లోపలనుంచి చేయిని పోనిచ్చి అతడి ఛాతీమీద వేళ్ళతో రాస్తూ, కళ్ళలోకి చూసింది.

"డాక్టర్ రామ్మూర్తిని రమ్మన్నా?" అడిగిందామె.

"వద్దు—హోటల్ డాక్టర్ నన్ను చూశాడు. నాకు మందులు రాసిచ్చాడు. అవి నేను కొన్నాను."

"ఆ మాత్రలు వేసుకున్నారా?"

"వేసుకున్నాను. సాయంత్రందాకా రెస్టు తీసుకోమని డాక్టర్ చెప్పాడు."

"అయితే పడుకోండి" అందామె.

కాస్సేపట్లో అతను నిద్రపోయాడు. అనసూయ బీరువా వైపు నడిచింది. తలుపు తెరిచింది. అతడి బ్రీఫ్ కేసువైపు చూసింది. అతడి బ్రీఫ్ కేసులో యేముంది?

బటన్ నొక్కి బ్రీఫ్ కేసు తెర్చి చూసింది. లోపల నిరోధ్ పాకెట్లు ఎన్నో వున్నాయి. ఒక ఆల్బమ్‌మీదకు ఆమె దృష్టి వెళ్ళింది.

ఆల్బమ్ తెర్చి ఆమె చూసింది. ఆల్బమ్‌లో అనేక మంది యువతుల ఫోటోలు వున్నాయి. ఆల్బమ్ పేజీలు తిప్పి అందరి యువతులవైపూ ఆమె చూసింది. ఎవరు

వీళ్ళు? హోటల్ హౌస్‌తో వీళ్ళకు సంబంధం ఏమిటి?

ఆలోచిస్తూ ఆమె ఆల్బమ్‌ను మళ్ళా చూసింది. కొందరు యువతులు చాలా అందంగా వున్నారు. తన భర్త బ్రీఫ్‌కేసులో యీ ఆల్బమ్, నిరోధ్ పాకెట్లు ఎందుకున్నాయి?

రాజా పరుపు దగ్గరకు ఆమె వెళ్ళింది. కాని అతను గాఢ నిద్రలో వున్నాడు.

ఐదింటికి రాజా నిద్ర లేచాడు. పక్కనున్న ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"అనూ, ఐయామ్ ఆల్‌రైట్" అన్నాడతను.

ఆమె అతడివైపు సూటిగా చూసింది. ఆమె మొహంలో నవ్వు లేదు.

"అనూ, ఏమిటి అలా చూస్తున్నావు?" అడిగాడతను.

"మీ బ్రీఫ్‌కేస్ తెర్చి చూశాను. అందులో నిరోధ్ పాకెట్లు చాలా వున్నాయి. ఎందుకవి?"

అతడు ఆమె చెయ్యి పట్టుకుని నిమిరాడు.

"అనూ, అవన్నీ ఎందుకు చూశావు?"

"చూడకూడదా?" అందామె.

"అలా నేను అనలేదు. అనూ, ప్రభుత్వంలో కుటుంబ నియంత్రణ విషయంలో మా హోటల్ సహకరిస్తోంది. మా హోటల్‌లో వుండే పెళ్ళయిన వాళ్ళకు మేము నిరోధ్ పాకెట్లు యిస్తూ వుంటాం. అవి నచ్చితే వాళ్ళు తర్వాత కొనుక్కుంటారు."

కాస్సేపు ఆమె మాట్లాడలేదు. అతడివైపు అనుమానంతో చూసింది.

"ఆ ఆల్బమ్ ఏమిటి? ఆల్బమ్‌లో ఎంతమంది యువతుల ఫోటోలో వున్నాయి" అందామె.

రాజా తీయగా నవ్వాడు.

"వాళ్ళందరూ మా మోడల్స్. హోటల్ హెవన్ పబ్లిసిటీకి, గార్మెంట్స్ ఫాక్టరీ దుస్తులకు వాళ్ళను మోడల్స్‌గా మేము వుపయోగిస్తాం" అన్నాడతను.

ఆమె లోలోపల బాధపడింది. ఏదో అనుమానంతో అనేక ప్రశ్నలు ఆమె వేసింది. నవ్వుతూ అతడు జవాబు యిచ్చాడు.

"రాజా, నన్ను క్షమించు!" అందామె.

"ఎందుకు?" ప్రశ్నించాడతను.

"మీ బ్రీఫ్ కేసులో వున్నవాటిని చూసి నేను అనేక విధాల ఆలోచించసాగాను" అందామె.

అతడు ఆమెను ముద్దెట్టుకున్నాడు.

"అనూ, అందుకే నేను అంటాను, నా వ్యాపారంలో వేలు పెట్టొద్దని!"

"ఇటుపైన మీ వ్యాపారానికి దూరంగా వుంటాను" అందామె.

"అలా వుంటే నీకు ఏ సమస్యలూ రావు. నువ్వు హాయిగా వుంటావు" అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయింది.

అతడామెను తన దగ్గరగా లాక్కున్నాడు. ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. ఆమె ఎర్రటి పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"అనూ, నువ్వు నా ప్రాణం! నీనుంచి ఏదీ నేను దాచను" అన్నాడతను.

5

అనసూయ మారువేషంలో హోటల్ హెవన్ రూమ్ నంబరు 20 లో సోఫాలో కూర్చుంది. ఆమె బెల్ నొక్కింది. నౌఖరు లోపలకు వచ్చాడు.

ఆమెవైపు చూశాడు. ఆమె పురుష వేషంలో వుంది. పైజామా, జుబ్బా, వెస్ట్‌కోట్ ధరించింది. సన్నటి మీసాలు. గిరిజాల జుత్తు.

“సార్, మీరు పిల్చారా?” అన్నాడు బాయ్.

“స్కాచ్ ఓల్డు పార్ విస్కీ పట్రా! సోడా అండ్ ఐస్ కావాలి” అందామె.

హోటల్ బాయ్ వెళ్ళిపోయాడు. కాస్సేపట్లో అతడు గదిలోకి వెళ్ళి అన్నీ టేబుల్ మీద పెట్టాడు.

“ఇంకా ఏమైనా కావాలా?” అడిగాడు.

ఆమె నవ్వింది. హోటల్ రిజిస్టర్లో ఆమె పేరు మిష్టర్ సి.పి. సింగ్, జమీందార్ ఆఫ్ ఆరాగా రాయబడింది.

“కావాలి” అందామె.

“ఏం కావాలి సార్” అడిగాడు నౌఖరు.

“మంచి అందమైన పిల్ల” అందామె.

“అతడిని పంపిస్తాను మీ గదికి” అని హోటల్ నౌఖరు వెళ్ళిపోయాడు.

ఆమె సిగరెట్ వెలిగించింది. పొగ పీల్చకుండా బయటకు వదిలేస్తూ కూర్చుంది. నిమిషాలు గడిచిపోయాయి.

పావుగంట తర్వాత అతడు మెల్లగా ఆమె గదిలోకి వెళ్ళాడు. అతడివైపు ఆమె ఆశ్చర్యంగా చూసింది.

“హోటల్ నౌఖరు మీకు మంచి అమ్మాయి కావా లన్నాడు. ఈ ఆల్బమ్ చూడండి! ఎందరో అందమైన

అమ్మాయిలు వున్నారు!" అన్నాడతను.

అతడివైపు చూస్తూ ఆమె ఉలిక్కిపడింది. అతడు మరెవరో కాదు, ఆమె భర్త రాజా!

తనలో చెలరేగే ఉద్రేకాన్ని అపుకుని ఆమె అతడి వైపు నవ్వుతూ చూసింది. ఆల్బమ్‌ని తీసుకుని చూడ సాగింది. ఒక ఫోటోవైపు చూపిస్తూ ఆమె అతడికేసి తిరిగింది.

"ఈమె నాకు కావాలి" అందామె.

"ఆమె రేటు వెయ్యి రూపాయలు. మీరు నాకు రెండువందలు అదనంగా యివ్వాలి" అన్నాడతను.

"ఎంతేనా యిస్తాను" అందామె.

"ఆమె ఎప్పుడు కావాలి?" అడిగాడతను.

"నేను యివాళ కొలంబో వెళ్తున్నాను. యెల్లుండి తిరిగివస్తాను. ఎల్లుండి రాత్రి ఆమె కావాలి."

"మీరు డబ్బు చెల్లిస్తే ఎల్లుండి రాత్రి ఆమె మీతో వుంటుంది" అన్నాడతను.

ఆమె బాగ్ తెర్చి పన్నెండు వందలు అతడికి యిచ్చింది.

"కొలంబోనుంచి నేను తిరిగొచ్చేసరికి ఆమె నా గదిలో రెడీగా వుండాలి" అందామె.

"వుంటుంది" అన్నాడతను.

"మీ పేరు ఏమిటి?"

"సంపత్" అన్నాడతను.

"అది మీరు పేరా?" అడిగిందామె.

"కాదు. అదే నా పేరు" అన్నాడతను.

అతడు ఆల్బమ్ తీసుకుని గుమ్మంవైపు వెళ్ళాడు. ఆమె అతడివైపు నడిచింది.

"మిస్టర్ సంపత్!" అందామె.

అతడు ఆమెవైపు చూశాడు.

"ఏదేనా చెప్పాలా?" అన్నాడతను.

"అంతా చెప్పేనుగా! ఆమెను నా గదికి పంపించు, ఎల్లుండి" అందామె అతడివైపు చూస్తూ.

"పంపిస్తాను" అన్నాడతను.

అతను బయటకు వెళ్ళిపోయాడు. ఆమె సోఫాలో బాధతో కూర్చుంది.

ఆమె భర్త సప్లయర్! ఆమె పొరబడి అతడిని పెళ్ళాడింది. అతడు ఏదో పెద్ద వ్యాపారం చేస్తున్నాడని ఆమె అనుకుంది. అంతా అబద్ధం! గది తలుపు మూసి అనసూయ పరుపుమీద ఏడుస్తూ పడిపోయింది.

6

ఆమె నిద్రపోతోంది. ఎవరో ఆమెను తట్టి లేపారు. ఆమె లేచి కళ్ళు నులుపుకుని అతడివంక చూసింది.

"అనూ, ఏమిటప్పుడే పడుకున్నావు?" అన్నాడతను.

"ఎలాగో వుంది" అందామె.

ఆమె ఒళ్ళు ముట్టుకుని చూశాడతను.

"డాక్టర్ రామ్మూర్తికి ఫోన్ చేశావా?"

"రేపటికి తగ్గిపోతుంది. తగ్గకపోతే చూద్దాం" అందామె.

అతడు బట్టలు మార్చుకున్నాడు.

"నేను భోజనంచేసి వస్తాను. నువ్వు విశ్రాంతి తీసుకో" అని అతను ఆమెవైపు చూశాడు.

"భోంచేసి రండి. ఒకవేళ నేను నిద్రపోతే లేపకండి" అందామె.

నవ్వుతూ అతడు కిందకు వెళ్ళిపోయాడు. అరగంట

తర్వాత అతను గదిలోకి వచ్చాడు. ఆమె నిద్రపోలేదు. చూస్తూనే వుంది.

"నిద్రపోలేదా?" అడిగాడతను.

"నిద్ర రావడంలేదు" అందామె.

అతడామె పక్కనే పడుకున్నాడు. ఆమె కళ్ళలోకి చూశాడు.

"అనూ, నువ్వు సరిగ్గా భోజనం చెయ్యలేదని మీ అమ్మగారు అన్నారు."

"ఆకలి లేదు" అందామె కష్టంగా.

ఆమె మీద అతడు చెయ్యి వేశాడు.

"ప్లీస్, నన్ను పడుకోనివ్వండి!" అందామె.

అతడు చెయ్యి తీసేశాడు.

"పడుకో! నేను నీ పక్కనే వుంటాను" అన్నాడతను.

ఆమె కళ్ళు మూసింది. భర్తను గురించే ఆమె ఆలోచిస్తోంది. అతడు ధనవంతుడనీ, ఏదో వ్యాపారం చేస్తున్నాడని భావించి తండ్రి తనను రాజాకిచ్చి పెళ్ళి చేశాడు.

తన అల్లుడు ఆడపిల్లలను తార్చి డబ్బు సంపాదిస్తున్నాడని తెలిస్తే ఆమె తండ్రి ఆత్మహత్య చేసుకుంటాడేమో!

తెలియకుండానే ఆమెకు నిద్రపట్టేసింది. ఆమె గాఢ నిద్రలో వుందని గ్రహించి అతడు లైట్‌ను తీసేసి జీరోవాట్ బల్బు స్విచ్‌ని నొక్కాడు.

పక్కకు తిరిగి అతడు పడుకున్నాడు. కాని నిద్ర రావడంలేదు. శారద అతడికి జ్ఞప్తికొస్తోంది. ఆమె

తనతో ఘోరంగా పోట్లాడింది. శారద!

జరిగినదంతా అతడి మెదడులో ఫిలిమ్ రీల్సులా తిరుగుతోంది.

శారద విజయవాడ పిల్ల. ఎవరో ఆమెను ఎత్తుకొచ్చి పదివేలకు తనకు అమ్మేశాడు.

రాజా ఆమె గదిలోకి వెళ్ళాడు. అతడిని చూసి ఆమె లేచి నిలబడింది. భయంతో అతడివైపు చూసింది.

దగ్గరగా వెళ్ళి ఆమె చెయ్యిని పట్టుకున్నాడతను. చెయ్యిని వెనక్కు లాక్కుని ఆమె దూరంగా జరిగింది.

"నేను చెప్పినట్లు చేస్తే నీకు ఏ ప్రమాదమూ రాదు!" అన్నాడతను.

"నీ చేతుల్లో పడ్డంకంటె పెద్ద ప్రమాదం ఏముంది?" అందామె వ్యంగ్యంగా.

అమాంతంగా అతడామెవైపు దూకాడు. పొడుగాటి ఆమె జడను పట్టుకున్నాడు. ఆమె అతడి చెయ్యిని కొరికింది. కోపంగా అతడామె చంపమీద కొట్టాడు. కాలితో అతడిని తన్ని, ఆమె గదిలో మరోవైపుకు పరుగెత్తింది.

కిందపడిన అతను లేచాడు. ఆమె తలుపును తెరవడానికి ప్రయత్నిస్తోంది. తను గంభీరంగా నవ్వాడు.

"లోపలనుంచి తాళం వేశాను. తలుపు తెర్చి నువ్వు బయటకు పోలేవు!" అర్చాడతను.

ఆమె అతడివైపు భయంతో చూసింది. "నన్నెందుకిలా చంపుకుతింటావు! నన్ను పోనీ! నీకు అక్కచెల్లెళ్ళు లేరూ?" అర్చిందామె.

"నిన్ను వదిలేయడానికి పదివేలు పోసివ్వలేదు" అన్నాడతను.

ఆమె అతడివైపు ఏడుస్తూ చూసింది.

"నాన్న బాగా డబ్బున్నవాడు. నీకు పదివేలకంటె ఎక్కువ నేను యిప్పిస్తాను. నా క్లాస్‌మేట్ చేసిన ద్రోహం మూలంగా నేను వాళ్ళకు చిక్కాను. నాకేదో మత్తు మందిచ్చి వాళ్ళు మద్రాసు తీసుకొచ్చి నీకమ్మేశారు. నాలాంటి అమాయకురాలైన ఒక యువతి జీవితాన్ని నాశనం చేయకు!" అందామె.

రాజా ఆమెవైపు చూశాడు. ఆమె వయస్సు పదహారు దాటి వుండొచ్చు. చాలా అందంగా వుంది. చదువుకున్న పిల్ల. ఆమె కొన్ని లక్షలు తనకు గడించి పెడుతుంది. కాని ఆమెను లొంగదీయాలి! తన తోవమ్మట ఆమె వెళ్ళేటట్టు చూడాలి!

అతడు నవ్వు నటిస్తూ ఆమెవైపు చూశాడు.

"నిన్ను వదిలేస్తానులే!" అన్నాడు.

"నిజంగా!" అందామె.

"నిన్ను వదిలేముందు కొన్ని విషయాలు నీతో మాట్లాడాలి" అన్నాడతను.

"చెప్పు!"

"ఆ పరుపుమీద కూర్చుని మాట్లాడుదాం."

"కావలిస్తే నువ్వు కూర్చో! నేను నించునే మాట్లాడగలను" అందామె.

ఆమె మాటలు వింటూంటే అతడిలో కోపం రగులుకుంది. ఆమెవైపు వెళ్ళాడతను. ఆమె మంచం చుట్టూ పరుగెడ్తోంది. వెనకనే అతడు వేటగాడిలా కదుల్తున్నాడు.

అమాంతంగా మంచంమీదనుంచి దూకి అతడామెను పట్టుకున్నాడు. ఆమె అతడి కళ్ళలోకి ఉమ్మింది. అతడు

కళ్ళు మూశాడు. అతడి నాతృణంలో పక్కన తోసి ఆమె దూరంగా పోయింది.

అతడు కోపంగా ఆమెవేపు చూశాడు.

"నీకు బుద్ధి చెప్తాను" అని తాళంతీసి తలుపు తెర్చాడతను.

బుచ్చి, పిచ్చి యిద్దరూ నిక్కర్లలో వున్నారు. అడవి పందుల్లా వున్నారు. వాళ్ళను చూడగానే ఆమె గుండె దడదడలాడింది.

"ఆమెను పట్టుకుని తాళ్ళతో కట్టేయండి. తర్వాత నేను వస్తాను" అని అతడు బయటకు నడిచాడు.

కునికిపాట్లు పడ్తూ రాజా ఆవులించాడు. పక్కన పడుకున్న భార్యవంక చూశాడు. ఆమె హాయిగా నిద్రపోతోంది.

అతడామె దగ్గరగా జరిగాడు. ఆమె ఒంటిమీద చెయ్యి వేశాడు.

కాస్సేపట్లో అతడికి నిద్రపట్టేసింది.

7

ఇరవై నంబరు గదిలో వున్న అనసూయ తలుపువైపు చూసి "కమిన్!" అంది.

తలుపు తోసుకుని ఒకమ్మాయి, వెనకనే రాజా లోపలకొచ్చారు. అతడా అమ్మాయిని కూర్చోమని మారు వేషంలో వున్న అనసూయ దగ్గరగా వెళ్ళాడు.

"జమీందార్ సాబ్, మీరు ఆల్బమ్ చూసి ఎన్నుకున్న యువతి అనారోగ్యంగా వుంది. అందువలన అంత కంటె అందమైన యువతిని తీసుకొచ్చాను. ఆమెకేసి చూడండి!"

అనసూయ సోఫాలో కూర్చున్న పిల్లవైపు ఆత్రంగా

చూసి పక్కనున్న రాజావంక చూసి కన్ను గీటింది.

"నాకు నచ్చింది, సంపత్!" అందామె.

"ఈమె చదువుకున్న పిల్ల. దరిజన్! మీకు స్వర్గం చూపిస్తుంది. ఈమెకోసం మీరు మరో ఐదువందలు యివ్వాలి" అన్నాడతను.

బాగ్ తెర్చి అనసూయ ఆరువంద రూపాయలనోట్లు అతడికిచ్చింది.

"ఐదువందలు ఆమెకు, వంద నీకు!", అందామె.

"పొద్దుట నేనొచ్చి తీసుకు వెళ్ళిందాకా ఆమెను యిక్కడే వుంచండి."

"నా చేతుల్లోంచి కదలనివ్వను!" అందామె.

"జమిందార్ సాబ్, వెళ్ళొస్తాను."

అతడు వెళ్ళిపోయాడు. ఆమె టైమ్ చూసింది. ఏడు కావస్తోంది. అనసూయ మెల్లిగా వెళ్ళి తలుపు మూసి లాక్ చేసింది. నవ్వుతూ సోఫాలో కూర్చున్న పిల్లవైపు చూసింది.

"నీ పేరు, మైడియర్?" అడిగిందామె.

"శారద" అందా యువతి.

"రా, పడుకుందాం" అని అనసూయ పరుపువైపు వెళ్ళి కూర్చుంది.

శారద లేవలేదు. ఏడుస్తూ కూర్చుంది.

"ఎందుకు ఏడుస్తున్నావు?"

చేతులు జోడించి శారద ఆమెకు నమస్కరించింది.

"మీరు పెద్ద జమీందారని విన్నాను. నన్ను రక్షించండి!" అంది శారద.

"నీకే ప్రమాదమూ రాదు. నా చెల్లెలుగా భావించి నిన్ను కాపాడ్తాను. నీ కథంతా నాకు చెప్పు" అంది

అనసూయ.

పరుపు మీద కూర్చున్న వ్యక్తివైపు శారద ఆశ్చర్యంగా చూసింది. ధైర్యంగా వెళ్ళి అనసూయ పక్కనే కూర్చుంది.

కన్నీళ్ళతో జరిగిందంతా చెప్పింది.

"నేను సంపత్ చేతుల్లో యిరుక్కున్నాను. అతడు కిరాతకుడు. అతడు పెట్టే బాధ భరించలేక ఏం చెప్పినా చేస్తానన్నాను. మీ గురించి చెప్పి అతడు నన్ను ఇక్కడకు తీసుకొచ్చాడు. నన్ను మా విజయవాడ పోనీయండి. ఈ జీవితంలో మిమ్మల్ని మర్చిపోను" అంది శారద.

"నిన్ను మీ వూరు పంపుతాను. సంపత్ నిన్ను ఏ యింట్లో వుంచుతున్నాడో తెలుసా?"

"అడ్రెసు తెలియదు. కాని ఆ యిల్లు చూపించగలను" అంది శారద.

"పద, పోదాం" అంది అనసూయ.

ఇద్దరూ బయటకు నడిచారు. రిసెప్షన్ గుమస్తాకి గది తాళంచెవిని అనసూయ ఇచ్చింది. బయటనున్న టాక్సీలో వాళ్ళు ఎక్కారు.

"శారదా, ఎలా వెళ్ళాలో నువ్వు డ్రయివర్‌కి చెప్పు" అంది అనసూయ.

హోటల్ గేటు దాటగానే ఎడంవైపుకు తిరగమంది శారద. ఆమె చెప్పినట్లు డ్రయివర్ టాక్సీని పోనిస్తున్నాడు.

నాలుగు రోడ్ల జంక్షన్‌లో టాక్సీ ఆగింది. యెలా వెళ్ళాలో చెప్పలేక శారద సతమతమౌతోంది.

"ఎడంవైపుకి!" అందామె చివరకు.

నిమిషాలు గడిచిపోతున్నాయి. ఒక యింటివైపు

చూపిస్తూ శారద "అదే యిల్లు!" అని అరిచింది.

టాక్సీ ఆగింది. గేటు మూసి వుంది.

"రాజా గార్మెంట్స్ కంపెనీ" అనే బోర్డువైపు అనసూయ విచిత్రంగా చూసింది.

"సెంట్రల్ స్టేషన్‌కి పద!" అంది అనసూయ.

టాక్సీ సెంట్రల్ స్టేషన్ వైపు వెళ్తోంది.

"ఆ యింట్లో యువతులు చాలామంది వున్నారా?"

"చాలామంది వున్నారు."

టాక్సీ ఆగింది. ఇద్దరూ దిగారు. అనసూయ డబ్బు చెల్లించింది.

సెంట్రల్ స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడ్తోంది. టికట్లమ్మే చోటుకు వెళ్ళారు వాళ్ళు.

విజయవాడకు అనసూయ టికెట్ కొంది. "రిజర్వేషన్ లేదు. జనరల్ కంపార్టుమెంట్‌లో ఎలాగో నువ్వు సర్దుకోవాలి" అంది అనసూయ.

"ఈ యమకూపంలోంచి బయటపడ్డానికి ట్రెయిన్ పైన కూర్చునైనా వెళ్ళగలను" అంది శారద.

అనసూయ ఆమెకు వందరూపాయలు యిచ్చింది. కొన్న టికెట్ యిచ్చింది.

"ఇంతెందుకు, సార్?" అడిగింది శారద.

"వుంచుకో! కలకత్తా మెయిల్ పదింపావుకి బయలేరుతుంది. అంతవరకూ నేనిక్కడ వుండలేను. జాగ్రత్తగా వెళ్ళు" అంది అనసూయ.

శారద చెయ్యి పట్టుకుని ఆమె కళ్ళలోకి చూసింది. ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

"మీరు దేవుడులాంటివారు. నన్ను నా ఊరుకు పంపిస్తున్నారు. మిమ్మల్ని ఎన్ని జన్మలెత్తినా మరువను"

అందామె.

"ధైర్యంగా వెళ్ళు శారదా! ముళ్ళూ, గులాబీలూ యీ లోకంలో పక్కపక్కనే వుంటూ వుంటాయి" అంది అనసూయ.

శారదకు బై బై చెప్పి అనసూయ వెనక్కి తిరిగింది. పరుగెడ్తూ శారద వచ్చింది.

"సార్, మీ పేరూ, అడ్రెసూ చెప్పండి!"

అనసూయ ఆమెవైపు సూటిగా చూసింది.

"నేను దేవుడిలాంటివాడినని నువ్వు అన్నావు, జ్ఞాపకముందా? దేవుడికి పేరూ, అడ్రెసూ వుండవు" అని అనసూయ గబగబా వెళ్ళిపోయింది.

అదృశ్యమైనదాకా ఆ ఆకారంవైపే చూస్తూ వుండిపోయింది శారద.

క్షణకాలం నిశ్శబ్దంగా నిలబడి కళ్ళు తుడుచుకుంది. మెల్లిగా ప్లాట్ ఫామ్ వైపు అడుగులు వేసింది.

8

అనసూయ నిద్రలేచేసరికి అతడు యింట్లో లేడు.

మొహం కడుక్కుని కాఫీ తాగుతూంటే టెలిఫోన్ మ్రోగింది.

"హలో" అందామె.

"అనూ, యివాళ భోజనానికి వస్తానని నీతో రాత్రి చెప్పాను. కాని రావడంలేదు" అన్నాడతను.

"నేను లేచే ముందే వెళ్ళిపోయారు. ఏమైంది?" అడిగిందామె.

"ప్రోబ్లమ్స్" అన్నాడు రాజా.

"ఏమిటవి?"

"జమీందార్ ఆఫ్ ఆరా మిస్టర్ సింగ్ మా

హోటల్లో గదితీసుకుని మాయమయిపోయాడు."

"అతడు మీ హోటల్ కి ఏదేనా డబ్బివాలా?" అడిగిందామె.

"బాకీ లేదులే! అడ్వాన్స్‌గా ముందే యిచ్చాడు."

"అయితే అదంత సమస్యకాదు. మీకు చెప్పకుండా తన ఊరు పోయి వుండొచ్చు."

"అతడు మాకు ఫాల్స్ అడ్రెసు యిచ్చాడు. అతడలా ఎందుకిచ్చాడా అని ఆలోచిస్తున్నాం."

"మీ హోటల్ కి నష్టం రానప్పుడు అతడిని గురించి బుర్ర పగలగొట్టుకోకండి" ఆమె సలహా యిచ్చింది.

"చూద్దాం, బైబై" అని అతడు రిసీవర్ పెట్టేశాడు. తనలో తను నవ్వుకుంటూ ఆమె రిసీవర్ని పెట్టేసింది.

స్నానం చేసి బ్రేక్ ఫాస్టు సేవించి ఆమె తన ఫియట్ కారులో బయలుదేరింది. కారును మైలాపూర్ పోనిచ్చింది.

భారత్ డిటెక్టివ్ ఏజెన్సీ ముందు కారాపి, దిగి మెట్లెక్కి పైకి వెళ్ళింది. మేనేజర్ని కల్సుకుంది.

అతడామె వైపు నవ్వుతూ చూశాడు.

"ఏం కావాలో చెప్పండి!" అన్నాడతను.

"బలంగా వున్న యిద్దరు పురుషులు నాకు కావాలి. ఒకరోజు పూర్తిగా వాళ్ళు నా కోసం పని చేస్తారు. పని ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో నేను వాళ్ళకు చెప్తుంటాను" అందామె.

"గుడ్. మీరు ఐదువందలు యివ్వాలి. ఇద్దర్ని మేం సప్లయి చేస్తాం."

ఆమె ఐదువంద రూపాయల నోట్లు టేబుల్ మీద పెట్టింది.

"వాళ్ళు ఎప్పుడు కావాలి?"

"నేను ఫోన్ చేస్తాను. నేను రమ్మన్నచోటకొచ్చి వాళ్ళు నన్ను కల్సుకోవాలి."

"అలాగే. మీ పేరూ అడ్రేసూ చెప్పండి."

"అవన్నీ అడక్కండి!"

"మరో ఐదువందలివ్వాలి. అటుపైన ఏమీ అడగం. అంతా మీ యిష్టం."

ఆమె మరో ఐదు నోట్లు యిచ్చింది. బైబై చెప్పి ఆమె హుషారుగా బయటకు నడిచింది.

9

బుచ్చి తలుపు తెర్చాడు. ఆమెను యిరువైపులా పట్టుకుని వాళ్ళు లోపలకొచ్చారు.

"ఈ అమ్మాయి అమ్మకానికుంది" అన్నాడు పైడిరాజు.

"ఎంత?" బుచ్చి అడిగాడు.

"పదిహేనువేలు" అన్నాడు కూనయ్య.

"ఇంతకంటె పెద్ద అందగత్తెలు తక్కువకు వస్తున్నారు" అన్నాడు పిచ్చి.

"కావలిస్తే కొనండి, వద్దంటే పోతాం" అన్నాడు పైడిరాజు.

"సంపత్ లేరు. దీన్ని యిక్కడొదిలి మళ్ళా రండి" అన్నాడు బుచ్చి.

ఆమె మొహంలో భయం గోచరిస్తోంది.

"పదరా పోదాం" అన్నాడు కూనయ్య.

"ఆగండి" అని బుచ్చి పిచ్చి లోపలకు వెళ్ళారు.

"పిల్ల బాగుంది. ఫోన్ చేసి అడుగుదాం" అన్నాడు బుచ్చి.

"నువ్వే ఫోన్ చేయి!" అన్నాడు పిచ్చి.

బుచ్చి రిసీవరెత్తి నంబరు తిప్పాడు. ఆ నంబరు బయట వాళ్ళకు తెలియదు.

"హలో, సంపత్!" అందో కంఠం.

"ఒకమ్మాయిని యిద్దరు కొత్తోళ్ళు తెచ్చారు. పది హేను వేలు కావాలిట" అన్నాడు బుచ్చి.

"పిల్ల ఎలా వుంది?"

"రంభలా వుంది సార్. బాగా డబ్బు చేసుకోవచ్చు."

"పదివేలకి సెటిల్ చేసుకోనండి. కాష్ బాక్స్‌లో డబ్బు వుంటుంది."

"అలాగే సార్."

బుచ్చి రిసీవర్ని పెట్టేశాడు. ఇద్దరూ బయట గదిలో కొచ్చారు. ఆ యువతి వైపు బుచ్చి పరీక్షగా చూశాడు. ఒంటిమీద నగలు లేవు. కాని ఆమె ఎంతో అందంగా వుంది.

"పదిహేను వేలనుంచి దిగుతారా?"

"ఎంతిస్తారో చెప్పండి. బేరం ఆడ్తూ కూర్చోడానికి మాకు టైములేదు."

"పదివేలు. పైసా ఎక్కువియ్యం" అన్నాడు బుచ్చి.

"తొందరగా డబ్బు ఫారేయండి. పోవాలి" అన్నాడు పెదిరాజు.

బుచ్చి లోపలకు వెళ్ళి కాస్సేపట్లో తిరిగి వచ్చి డబ్బు యిచ్చాడు. పెదిరాజు డబ్బును లెఖ్ఖెట్టి దాచుకున్నాడు. వాళ్ళిద్దరూ బయటకు వెళ్ళిపోయారు.

బుచ్చి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"పద లోపలకు!" అర్చాడు.

"నన్ను వదులు. నా అంతట నేను వస్తాను" అందామె.

బుచ్చి ఆమెను వదిలేశాడు.

"నా మాట వింటే నీకు దెబ్బలు తగలవు!" అన్నాడు బుచ్చి.

ఆమెను ఒక గదిలోకి తీసుకెళ్ళాడు. ఆమెను పట్టుకుని దగ్గరగా లాగబోయాడు. ఆమె విదిలించుకుని దూరంగా వెళ్ళింది.

"మీ యజమాని సంపత్ కి యిదంతా చెప్పనా?" అడిగిందామె.

"ఆయనతో చెప్పొద్దు, పిల్లా. నిన్ను ఏమీ చెయ్యనులే. ఆయన కోపిష్టి. నా తోలు ఒల్చేస్తాడు" అన్నాడు బుచ్చి.

ఆమె కుర్చీలో కూర్చుంది. గదిలో లైటు వెల్గుతోంది. ఫాన్ తిరుగుతోంది.

"నువ్వు సుఖంగా విశ్రాంతి తీసుకో! మా యజమాని వచ్చి నీతో మాట్లాడతాడు" అన్నాడతను.

"నాకు బాగా ఆకలిగా వుంది. ఏదేనా తినాలి. వాళ్ళిద్దరూ నన్ను ఆకల్తో మాడ్చేశారు" అందామె.

బుచ్చి బయటకెళ్ళాడు. ఒక ప్లేటులో కేక్స్, బిస్కట్లు తెచ్చి ఆమెకిచ్చాడు. గ్లాసులో నీళ్ళుపోసి ఆమె పక్కనే పెట్టాడు.

"పిల్లా, నీ పేరు?"

"సంఘమిత్ర" అందామె.

బుచ్చి బయటకు వెళ్ళాడు. తలుపు బయటనుంచి మూయబడింది.

10

వీర్రాజు, అతడి భార్య సత్యవతి ముందు వరండా మీద కూర్చుని గేటువైపు చూస్తున్నారు. టైమ్ పది

దాటింది.

"సాయంత్రం వెళ్ళింది అమ్మాయి. ఇంత సేపు ఏం చేస్తోందో!" అన్నాడు వీర్రాజు.

"అదే బెంగగా వుంది" అంది భార్య.

నిమిషాలు గంటలై దొర్లిపోతున్నాయి. పన్నెండు దాటింది. గేటులోకి తిరిగివస్తూన్న కారువైపు వాళ్ళు సంతోషంగా చూశారు.

మెర్సిడిస్ కారొచ్చి వాళ్ళముందు ఆగింది. రాజా కిందకు దిగి వాళ్ళవైపు చూశాడు.

"ఏమిటిక్కడున్నారు?" అడిగాడు.

"సాయంత్రం కారులో వెళ్ళిన అమ్మాయి యింకా తిరిగిరాలేదు!" అన్నాడు వీర్రాజు.

"ఏమైందో!" అంది సత్యవతి.

"మీరు గాభరాపడకండి. నేను అంతా చూస్తాను" అని అతడు లోపలకు వెళ్ళాడు.

పడగ్గదిలోకి వెళ్ళి చూశాడు ఆమె చీటీకోసం. ఎక్కడికైనా వెళ్ళి ఆలస్యంగా వస్తాననుకుంటే ఆమె చీటీరాసి తలగడకింద పెడ్తూ వుంటుంది. కాని ఎక్కడా ఆమె చీటీ పెట్టలేదు.

అనసూయ ఏమైంది? ఎక్కడికి కెళ్ళింది?

అతడు చిరాకుగా కిందకు పరుగెత్తాడు. ఎన్నో అడ్డంకులు తన వ్యాపారానికి యీ మధ్య యేర్పడుతున్నాయి.

తను పదివేలిచ్చి కొన్న శారద మాయమైపోయింది. ఆమె ఏమైందో తెలియదు. ఆరా జమీందార్ సింగ్‌తో ఆమె బయటకు వెళ్ళినట్లు కొంతమంది చూశారు. కాని సింగ్ యేమైనాడో యెవ్వరికీ తెలియదు. రిసెప్షన్

గుమస్తాకు గది తాళం ఇచ్చి సింగ్ వెళ్ళిపోయాడు. శారద అందానికి దాసినైన సింగ్ ఆమెతో ఎక్కడికో వెళ్ళిపోయి వుండాలి!

పోలీసులదాకా వెళ్ళడం అతడికిష్టంలేదు. తానే పరిశోధన సాగిస్తున్నాడు.

కింద హాల్లో వున్న వీర్రాజు, సత్యవతి అతడివైపు భయంలో చూశారు.

"మీరు వెళ్ళి పడుకోండి. అసలు ఏమైందో నేను వెళ్ళి చూస్తాను" అని అతడు బయటకు పరుగెత్తాడు.

కారులో కూర్చుని తలుపు మూశాడు. డ్రయివర్ కారును పోనిచ్చాడు.

"ఎక్కడికి సార్?" అడిగాడు డ్రయివర్.

"పట్నం రోడ్లమ్మట పోనీ!" అన్నాడతను.

కారు వెళ్తోంది. రాజా ఆమె ఫియట్ కారుకోసం చూస్తున్నాడు.

రెండు గంటలుపైన కారు తిరుగుతూనే వుంది. కాని ఎక్కడా ఫియట్ కనబడలేదు.

అతడు టైమ్ చూశాడు. రెండున్నర కావస్తోంది. "బీచ్ కి పద!" అన్నాడతను.

కారు బీచ్ వైపు దూసుకుపోయింది. బీచ్ లోపల రోడ్డుకి తిరిగి వెళ్తోంది.

"డ్రయివర్, ఆ ఫియట్ పక్కనే ఆపు!" అరిచాడతను.

మెర్సిడిస్ కారు ఆగింది. అది అనసూయ ఫియట్ కారే! అతడు కిందకు దూకాడు. పరుగెత్తుకెళ్ళి ఫియట్ కారులోకి చూశాడు.

లోపల ఎవ్వరూ లేరు. కారు కదలక, దాన్ని

ఇక్కడ వదిలేసి ఏ టాక్సీలోనో ఇంటికి వెళ్ళిపోయిందా?

అతడు ఫియట్ కారులో కూర్చున్నాడు. ఇగ్నిషన్ కీ కారులోనే వుంది. కీ తిప్పాడు కారు యింజన్ వెంటనే స్టార్టయింది.

లోపల లైట్ ఆన్ చేసి అంతా చూశాడు. ఆమె వస్తువులేవీ కార్లో లేవు. అతడు డ్రయివర్ని పిల్చాడు.

"డ్రయివర్, నువ్వు ఆ కారులో ఇంటికిపో! నేను తర్వాత వస్తాను" అని ఫియట్ కారును పోనిచ్చాడతను.

అనసూయకు ఏదో ప్రమాదం సంభవించింది. సందేహం లేదు! అతడి గుండె దడదడలాడింది.

ఈ సమయంలో విస్కీ సేవించాలి. విస్కీ సేవిస్తే గాని తను బతకలేడు. అతడు కారును వేగంగా రాజా గార్మెంట్స్ కంపెనీవైపు పోనిచ్చాడు.

అతడిని చూడగానే గూర్ఖా గేటు తెర్చి శల్యూట్ చేశాడు. అతడు కారును కాంపౌండులోకి పోనిచ్చి ఆపాడు. కిందకు దిగి తలుపును తట్టాడు.

టైమ్ మూడు దాటింది. బుచ్చి కళ్ళు నులుపుకుంటూ తలుపు తెర్చాడు. అతడి చెంపమీద రాజా తటాలున కొట్టాడు.

"తలుపు తీయడానికి యింత ఆలస్యమా!" అర్చాడతను.

అనసూయ కనిపించని ఈ లోకంలో ఎవర్ని చూసినా తన్నాలనిపిస్తోందతనికి!

అతడు తన గదిలోకి వెళ్ళి కుషన్డ్ కుర్చీలో కూర్చున్నాడు. బుచ్చి గదిలోకొచ్చాడు.

"స్కాచ్ విస్కీ, సోడా, ఐస్ క్యూబ్స్" అన్నాడతను.

క్షణంలో అన్నీ టేబుల్ మీద వున్నాయి. గ్లాసులో విస్కీ పోసి, సోడా కలిపి, ఐస్ క్యూబ్స్ పడేసి బుచ్చి అతడికి యిచ్చాడు. అతడు గడగడ తాగేశాడు.

నాలుగు పెగ్స్ తాగాక అతడి గుండె దడ తగ్గింది. బుచ్చి మళ్ళీ గ్లాసును అందించాడు. రాజా వేగంగా తాగేసి సిగరెట్ వెలిగించాడు.

"ఆ పిల్లను కొన్నారా?" అడిగాడు రాజా.

"పదివేలిచ్చి కొన్నాం, సార్" అన్నాడు బుచ్చి.

"ఆమె ఎక్కడుంది?"

"రూమ్ నంబరు 25లో. ఆమె పేరు సంఘమిత్ర. ఇనపకడ్డీలాంటి యువతి. వంచడానికి మనం శ్రమపడాలి" అన్నాడు బుచ్చి.

"ఇనపకడ్డీలను వంచడం నాకు సరదా. ఇంకా విస్కీ పోయి!"

విస్కీ బాగా తాగి రాజా లేచాడు. ఇరవైఐదు గది వైపు నడిచాడు. సంఘమిత్ర! ఆమె తోలు ఒల్చేసి తన కాళ్ళముందు పడేటట్లు తను చూడాలి!

అతడు తలుపు తెర్చి లోపలకు వెళ్ళాడు. ఆమె పరుపుమీద పడుకుని నిద్రపోతోంది. ఆమె అటువైపుకు తిరిగి పడుకుంది!

అతడు మంచం పక్కనే నిలబడ్డాడు. ఆమె జడను పట్టుకుని బలంగా లాగాడతను. ఆమె లేచి కూర్చుంది. అతడివంక చూసింది. అతడు ఆమె జడను వదిలేశాడు. కన్నీళ్ళతో ఆమె అతడి చెయ్యి పట్టుకుంది.

"మీరు యిక్కడికెలా వచ్చారు?" అందామె.

"అనూ, గట్టిగా మాట్లాడకు! నిన్ను రక్షించడానికి నేనిక్కడికొచ్చాను. నిన్ను యిక్కడ అమ్మినట్లు నేను

కనుక్కొని తెగించి ఇద్దరితో పోట్లాడి లోపలకొచ్చాను. మనం పోదాం పద!" అన్నాడతను.

ఆమె కిందకు నూకింది.

"నువ్వు యిక్కడే వుండు. వాళ్ళు ఎలా వున్నారో నేను చూసి వస్తాను" అని అతడు బయటకు వెళ్ళాడు.

కాస్సేపట్లో అతడు తిరిగి వచ్చాడు.

"వాళ్ళు లేచారు. వాళ్ళతో యుద్ధంచేసి మనం బయటపడాలి, ఇక్కడుంటే ప్రమాదం" అన్నాడు.

"పదండి" అందామె.

ఇద్దరూ బయటకు నడిచారు. బుచ్చి వాళ్ళకు అడ్డు పడ్డాడు. రాజా అతడిని కాల్తో తన్నాడు. అతడు దూరంగా నేలమీద పడ్డాడు.

ఇద్దరూ పరుగెత్తారు. ముందు గదిలో పిచ్చి అతడిని ఎదిరించాడు. రాజా అతడి చంపమీద కొట్టాడు. పిచ్చి నేలమీద పడ్డాడు.

ఆమె చేయి పట్టుకుని రాజా బయటకు పరుగెత్తాడు. ఫియట్ కారులో యిద్దరూ కూర్చున్నారు.

అతడు కారును గేటువైపు పోనిచ్చాడు. గూర్ఖా గేటు తెర్చి అతడికి శల్యూట్ చేశాడు.

అతడు కారును బయటకు పోనిచ్చాడు.

"బతికాం!" అన్నాడతను.

"వాళ్ళిద్దరిలా గూర్ఖా మనల్ని ఆపనందుకు మనం సంతోషించాలి. గూర్ఖా మీకు శల్యూట్ కూడా చేశాడు" అందామె.

"నన్ను చూసి గూర్ఖా మరెవరో అనుకుని పొరబడి వుంటాడు!" అన్నాడతను.

"గూర్ఖా మిమ్మల్ని లోపలకు రానిచ్చాడుగా, అందుకే పోనిచ్చాడు" అందామె.

రాజా మాట్లాడలేదు. వేగంగా కారును యింటివైపు పోనిచ్చాడు. టైమ్ నాలుగు కావస్తోంది.

ఇంటిముందు కారు ఆపి, యిద్దరూ దిగారు. వీర్రాజు, సత్యవతి పరుగెత్తుకొచ్చారు.

"ఏమైందమ్మా?" అడిగాడు తండ్రి.

ఆమె నవ్వుతూ రాజావంక చూసింది.

"ఏమీ అవలేదు, నాన్నా! కారు కదల్లేదు. బీచ్‌లోనే వుండిపోయాను. ఆయనొచ్చి తీసుకొచ్చారు" అంది అనసూయ.

"రండి, భోజనాలు చేద్దురుగాని" అంది సత్యవతి.

"ఇప్పుడు భోజనం ఏమిటమ్మా!" అంది కూతురు.

"నాకు ఆకలిగా వుంది" అన్నాడు రాజా.

"పదండి" అంది అనసూయ.

భోజనాలు ముగించి యిద్దరూ పైకి వెళ్ళారు. పరుపు మీద అనసూయ పడుకుంది. పక్కనే పడుకుని ఆమె మీద చెయ్యి వేశాడతను.

ఆమె అతడివైపు అసహ్యంతో చూసింది.

"మిష్టర్ సంపత్, నన్ను ముట్టుకోకండి! నామీద చెయ్యి వెయ్యకండి!" అర్చిందామె.

అతడు తృళ్ళిపడ్డాడు.

11

ఆమెవైపు సూటిగా చూశాడు.

"అనూ, సంపత్ ఎవరు?"

"మీరే!" అందామె.

"అనూ, నీ మెదడు పాడై వుంటుంది. నేను సంపత్

కాదు, నీ రాణిని.

ఇద్దరూ లేచి కూర్చున్నారు. ఏడుస్తూన్న కళ్ళతో ఆమె అతడివైపు చూసింది.

"మీరు మా పల్లెటూరికి వచ్చారు. నన్ను పెళ్ళాడ్తా నన్నారు. మీ డబ్బూ అదీచూసి, మీరేదో గొప్ప వ్యాపారం చేస్తున్నారని భావిస్తూ నాన్న మన పెళ్ళికి ఒప్పుకున్నారు. నిజం తెలిస్తే నాన్న తల దించుకుని, గుండెలు బాదుకుని ఏడ్చేవారు!" అందామె.

"ఏమిటి నువ్వనేది?"

"ఏ వ్యాపారంచేసి మీరు ఈ లక్షలు గడిస్తున్నారో ఆలోచించండి! నన్ను ఎత్తుకుపోయి అమ్మేసినట్లే అనేక మంది యువతులను ఎత్తుకొచ్చి మీరు నడిపే ఆ వ్యభిచార గృహానికి అమ్మేస్తున్నారు. అమాయకురాలైన ఆడపిల్లల్ని కొని, వాళ్ళను హింసించి, లొంగదీసి మీరు మీ వ్యాపారంకోసం వుపయోగిస్తున్నారు. మీరు అనుభవించే డబ్బు అనేకమంది కన్నీళ్ళలోంచి వెలువడే పాపిష్టి సొత్తు!" అర్చిందామె.

"అనూ, లేనిపోనివి వూహించుకుని నన్ను అవమాన పరుస్తున్నావు!" గద్దించాడతను.

ఆమె వ్యంగ్యంగా నవ్వింది.

"మాయమైన ఆరా జమీందార్ సింగ్ నేనే! మారు వేషంలో హోటల్ హెవన్‌లో గది తీసుకుని మీకు 1800 రూపాయలు యిచ్చాను. ఆ అమాయకురాలైన శారదను నేనే విజయవాడకు పంపేశాను. మీ నిజరూపం ఈ కళ్ళతో చూశాను! నేను పూజించే భర్త ఇటువంటి మట్టిబొమ్మని గుండెలు బాదుకుని ఏడ్చాను" అందామె.

అతడు మాట్లాడలేదు. వెక్కి వెక్కి యేడుస్తూ వుండి

పోయాడు. కొంతసేపయ్యాక కన్నీళ్ళతో ఆమెకేసి చూశాడు.

"అనూ, నా కథ చెప్తాను, విను. మా నాన్నకు పన్నెండుగురు పిల్లలు. డబ్బు లేదు. పెట్టింది తిని మేం బతికేవాళ్ళం. ఆ జీవితంతో విసుగెత్తి నేను మద్రాసుకు పారిపోయాను. అప్పుడు నా వయస్సు పధ్నాలుగు దాటి వుండదు.

"సామానులు మోసి కూలీ డబ్బుల్తో జీవించేవాడిని. పరశురామ్ అనే అతడితో నాకు పరిచయమైంది. కూమ్ నది ఒడ్డున ఒక పాకలో వుండేవాడతను. నేనూ అక్కడకు మారిపోయాను.

"నాటు సారా తాగినవాళ్ళు ఆ పాకలోకి వచ్చి వాళ్ళ కామాన్ని తీర్చుకునేవారు. ముగ్గురు యువతులు అక్కడ వుండేవారు. పరశురామ్‌కి నేను సహాయపడే వాడిని. తిండి పెట్టి అతడు నాకు జీతం యిచ్చేవాడు.

"కొంత కాలం తర్వాత అతడు మరణించాడు. అతడి వ్యాపారాన్ని నేను నడిపేవాడిని. ఆ పాకలోకి ఒకసారి తారాచంద్ వచ్చాడు. ఇద్దరం మిత్రులమయ్యాం, మేం కూడబెట్టిన డబ్బుతో ఒక లాడ్జిని నడిపాం. అలాఅలా మా వ్యాపారం పెరిగింది. హోటల్ హెవన్ గా రూపొందింది. కాని ఎప్పుడూ నా వృత్తి ఒక్కటే! అదేమిటో నీకు తెలుసు.

"ఇప్పుడు తారాచంద్‌ని పేరుకి మాత్రం వుంచుతున్నాను. అంతా నాదే. రాజా గార్మెంట్స్ అనే తెర వెనక అనేకమంది యువతులను కొని నా కస్టడీలో వుంచాను. హోటల్ హెవన్‌కి వచ్చే డబ్బున్నవాళ్ళు నా దగ్గరున్న యువతులను సప్లయిచేసి ఎంతో డబ్బు

సంపాదించాను. ఇదంతా చెప్పడానికి నాకే సిగ్గేస్తోంది. ఇప్పుడు ఏం చెయ్యాలో నాకు తెలియడంలేదు. ఈ మురికి కూపంలోంచి బయటపడాలని నాకూ వుంది. కాని ఇందులో యిరుక్కుపోయాను" అని అతడు ఆగాడు.

ఆమె అతడివైపు తీక్షణంగా చూసింది.

"రాజా, అధః పాతాళానికి దిగిపోయిన మనిషికూడా తన జీవితాన్ని మార్చుకునే అవకాశం వుంది. మీరు మారడమే కాదు! ఇంతకాలం మీరు హింసించి పిండుకు తిన్న ఆ యువతులను కూడా మనం మరో తోవకు మరలించాలి."

"అనూ, ఏం చెయ్యాలో నువ్వే చెప్పు!" అన్నాడతను.

ఆమె టైమ్ చూసింది. ఐదయింది. "దేవుడు మనకి చూపిస్తాడు సరైన తోవ!" అందామె స్పష్టంగా.

12

ఆమె కార్లోంచి దిగి పైకి వచ్చింది. రాజా ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"రాజా, మొత్తం 120 మంది స్త్రీలు అక్కడ వున్నారు. అందులో 50 మంది వాళ్ళ ఊళ్ళకు వెళ్ళిపోతామన్నారు. ఒక్కొక్కళ్ళకి 10 వేలు ఇచ్చి వాళ్ళను క్షేమంగా పంపించేద్దాం" అందామె.

"అలాగే చేద్దాం" అన్నాడతను.

"ఇంతవరకూ రాజా గార్మెంట్స్ కంపెనీ ఒక అవినీతికరమైన వ్యాపారానికి తెరగా వుంది. ఇప్పుడది మారుద్దాం. విదేశీ మిషన్లను తెప్పించి గార్మెంటు ఫాక్టరీ నడుపుదాం. కొందరు స్త్రీలకు మనం అందులో ఉద్యోగాలు యివ్వొచ్చు. వర్కింగ్ వుమెన్స్ హాస్టలు

స్థాపించుదాం. మన దగ్గర మిగిలిన తతిమ్మా 70 మందికీ అక్కడ గదులిచ్చి, భోజన సౌకర్యాలు చేకూరేటట్లు చూద్దాం. ఏదేనా ఉద్యోగం దొరికితే అందులో చేరి పనిచేస్తూ, సక్రమంగా జీవిస్తామని ఈ 70 మందీ నాతో చెప్పారు."

"అవునూ, బాగుంది. వాళ్ళ జీవితాలు మారిపోతాయి" అన్నాడతను.

ఆమె అతడివైపు చూసింది.

"మీ పేరు రాజా! సంపత్ పేరు గతంలో కలిసి మాయమైపోయింది. ఇటుపైన హోటల్ హెవెన్ పెద్ద మనుషులు బసచేసే హైక్లాస్ హోటలుగా నడపబడుతుంది" అందామె.

కన్నీళ్ళతో అతడు ఆమెవంక చూశాడు.

"మళ్ళీ జన్మ ఎత్తినట్టు అనిపిస్తోంది నాకు" అన్నాడతను.

ఆమె నవ్వుతూ అతడివంక చూసింది.

"మనిషి మనస్ఫూర్తిగా కోరుకుంటే, ఆశిస్తే ఎటువంటి హీన పరిస్థితిలోంచైనా బయటపడి వున్నత శిఖరాలవైపు ప్రయాణం చేయొచ్చు! మనకు దీక్ష సాధన వుంటే చాలు. దైవానుగ్రహం ఎప్పుడూ వుంటుంది" అంది అనసూయ.

"అవునూ, నువ్వొక దేవతవు!" అన్నాడతను వుద్రేకంతో.

—: అయిపోయింది :—